# అంతరంగం

జానకిరామయ్య చేతి గడియారం వంక చూసుకున్నాడు. తల కొంచెం పైకెత్తి తూర్పుదిక్కున సూర్యుడు ఎంత ఎగబాకేడో ఒక్కక్షణం గమనించాడు. 'గడియారాన్ని నమ్ముకున్నావుగా! మరి నాతో నీకేం పని?' అంటూ సూర్యుడు చిరచిర లాడినట్లనిపించింది జానకిరామయ్యకి. వరండాలోకి వచ్చి కొద్దిసేపు కుర్చీలో కూర్చున్నాడు. ఎంతసేపో కూర్చుండిపోయాననుకున్నాడు. గతుక్కున లేచి వాకిట్లోకి వెళ్ళాడు. వీధి చివరికంటా పరిశీలనగా చూశాడు. పది క్షణాలు అక్కడే నిలబడిపోయాడు. నెమ్మదిగా నడుచుకుంటూ వరండాలోకి వచ్చి హాల్లోకి తొంగి చూశాడు. కుర్చీలూ, మధ్యలో టీపాయ్ పద్ధతి ప్రకారం అమర్చివున్నాయని సంతోషించాడు.

పెళ్ళివారు రాగానే చక్కగా పలకరించి కాళ్ళు కడుక్కునే ఏర్పాటు చేసి లోపలికి తీసుకురావడం ఆయన వంతు. అమ్మాయిని ముస్తాబు చేసి పెళ్ళిచూపుల ఏర్పాట్లు చూడడం ఆడవాళ్ళ పని. అందులో తన జోక్యం పనికిరాదన్నారు.

జానకిరామయ్య మరోసారి వాకిట్లోకి వెళ్ళాడు. పెళ్ళివారు రావడంలేదు. చకచకా నడుచుకుంటూ వీధి మలుపు చేరుకున్నాడు. రోడ్డు వెంట ఆయన చూపులు పరుగెత్తాయి. అలసిన చూపులు తిరిగి వచ్చాయి. చూపులు చేతి గడియారంపైకి మళ్ళాయి. పెళ్ళివారు చెప్పిన టైము ఇంకా పదినిమిషాలుంది. మనస్సులో దేవుడ్ని వేయివిధాల వేడుకుంటూ ఇంటి గుమ్మం చేరుకున్నాడు. అక్కడ నిల్చుని వీధి మలుపు మీద దృష్టి నిల్పాడు.

రెండో కూతురు సుజాతకి ఇలాంటి సంబంధం రావడం కేవలం పరమాత్ముడి దయ అని ఆయన నమ్మకం. పెద్దమ్మాయికి మేనరికం చేశాడు. వాళ్ళు పొలాన్ని నమ్ముకుని నిక్షేపంగా ఉన్నారు. కొడుక్కి బ్యాంకు ఉద్యోగం దొరికింది. వాడికి పెళ్ళి చెయ్యాలి. అమ్మాయి పెళ్ళి ముందు కానివ్వాలి గదా! సుజాత చాలా తెలివి గలది. జాతకంలోనే వుంది పెద్దింటి కోడలవుతుందని. అయినా జానకిరామయ్య కల్లో కూడా అనుకోలేదు - తన కూతురికి అమెరికా సంబంధం వస్తుందని. అనుకోకుండా తటస్థపడింది. మిత్రుడొకడు చెప్పాడు, న్యూజెర్సీలో ఇంజనీరుగా వుంటున్న కుర్రాడికి సంబంధం చూస్తున్నారని. వివరాలిచ్చాడు. అమ్మాయి వివరాలు పంపాడు. జాతకం జతపరిచాడు. జాతకాలు కలిశాయనీ, అబ్బాయి ప్రసాద్ సెలవు మీద వచ్చినప్పుడు పెళ్ళిచూపులకు వస్తామనీ జవాబిచ్చారు. అబ్బాయి తల్లిదండ్రులు రాజమండ్రిలో వుంటున్నారు. సొంత ఇల్లూ గట్రా వున్నాయి. తమ వూరికి దగ్గరే

కావడం జానకిరామయ్యకి మరింత సంతోషం కలిగించింది. అబ్బాయి అమెరికా నుంచి రాగానే జానకిరామయ్య రాజమండ్రి వెళ్ళి కలిసివచ్చాడు. అబ్బాయి దొరబాబులా ఉన్నాడు. నిదానస్తుడు. సుజాత ఫోటో వాళ్ళందరికీ నచ్చి ఉంటుందని కుర్రాడి తల్లిదండ్రుల మాటల ధోరణినిబట్టి గ్రహించారు. వాళ్ళుమాత్రం పైకేమీ తేలలేదు. ముందు అమ్మాయిని చూడాలని చెప్పారు. అందుకే వెంటనే పెళ్ళిచూపులు ఏర్పాటు చేశాడు. అమ్మాయి వాళ్ళకి నచ్చితే తన చిట్టితల్లి గొప్ప అదృష్టవంతురాలనుకున్నాడు. తన బాధ్యత తీరుతుంది. కాని, దేశం కాని దేశం వెళ్ళిపోతుంది. అయితే ఆడపిల్ల పుట్టిల్లు వదలక తప్పదు కదా అని మనస్సుకు సర్ది చెప్పుకున్నాడు.

వీధి మలుపు దగ్గర కారు హారను వినిపించడంతో జానకిరామయ్య ఆలోచనలకు అడ్డు పడింది. ఉలికిపడి అటు చూశాడు. పెళ్ళివారి కారు వస్తోంది. లోపలికి చూసి పెళ్ళివారు వస్తున్నారని చెప్పి, కొంచెం కారు ఎదురువెళ్ళాడు. వీధి గుమ్మం దగ్గర కారు ఆగగానే చిరునవ్వుతో వినయంగా ఆహ్వానం పలికాడు.

పెళ్ళికొడుకు సూటూ బూటుతో అట్టహాసంగా వస్తాడనుకున్నాడు జానకిరామయ్య. పైజామా లాల్చీతో సాదాగా వున్న అబ్బాయిని చూసి ఆశ్చర్యపోయాడు. అబ్బాయి తల్లిదండ్రులూ, వదినా అన్నా వెంట వచ్చారు.

జానకిరామయ్య భార్యా, కొడుకూ, పెద్దకూతురూ వచ్చి పెళ్ళివారిని సాదరంగా పలకరించారు. కాళ్ళు కడుక్కునేందుకు నీళ్ళందించారు. తుడుచుకునేందుకు తువ్వాళ్ళు ఇచ్చారు. అడుగడుగునా వారిలో మర్యాద వుట్టిపడుతోంది.

అందర్నీ హాల్లోకి తీసుకువెళ్ళారు. ఉన్నంతలో అక్కడ డాబుసరిగా వస్తువులు అమర్చారు. ట్రేలో మంచినీళ్ళగ్లాసులు తెచ్చి కావలసినవారికి ఇచ్చారు.

ప్రసాద్ ఒకసారి చుట్టూ పరిశీలనగా చూశాడు. ఏమైనా లోపం వుందేమోనని జానకిరామయ్యలో బెరుకు ఏర్పడింది. అబ్బాయికి ఎదురుగా సుజాత కూర్చునేందుకు కుర్చీ వేసి ఉంచారు.

ఫలహారాలు పట్టుకొచ్చి అందించారు. 'ఇవన్నీ ఎందుకూ?' అబ్బాయి తండ్రి లాంఛనంగా అన్నాడు.

'ఏదో మా ఆనందం కోసం, ఇది పల్లెటూరు. మా సంతృప్తికైనా మీరు తీసుకోవాలి.' బ్రతిమాలుతున్నట్లు అన్నాడు.

'కాని, మీ ఏర్పాట్లలో ఎక్కడా పల్లెవాసన కనిపించడం లేదు' నవ్వుతూ బదులిచ్చాడు కుర్రాడి తండ్రి.

అందరూ హాయిగా శ్రుతి కలిపారు.

ఫలహారాలు పూర్తి అయ్యాయి. కాఫీ తాగారు.

అయినా అమ్మాయిని హాల్లోకి తీసుకురాలేదు.

'అమ్మాయిని తీసుకురండి.' అబ్బాయి తల్లి చెప్పింది.

'ఫలహారాలయ్యాక తీసుకురావాలని ఆగాం.' జానకిరామయ్య సంజాయిషీ ఇచ్చుకున్నాడు.

వెంటనే తల్లి లోపలికి వెళ్ళి, సుజాతను తీసుకువచ్చి అబ్బాయికి ఎదురుగా కుర్చీలో కూర్చోబెట్టింది.

అబ్బాయి తాలూకు వాళ్ళంతా సుజాతను రెండు మూడు నిమిషాలు పరీక్షగా చూశారు.

'నీ పేరేమిటమ్మా?' అబ్బాయి తల్లి అడిగింది.

'సుజాతండి!' తల కొంచెం పైకెత్తి నెమ్మదిగా చెప్పింది.

'ఏం చదువుకున్నావమ్మా?' అబ్బాయి తండ్రి ప్రశ్న.

'బి.కాం పాసయ్యానండి!' తల దించుకుని సుజాత బదులు పలికింది.

'వంటా అవీ వచ్చా?' అది అబ్బాయి వదిన వేసిన ప్రశ్న.

'ఫర్వాలేదు. ఒక మాదిరిగా చేస్తుంది. అయినా ఇప్పటిదాకా చదువు మూలంగా ఇంటి పనులు చేయనివ్వడంలేదండీ!' సుజాత తల్లి వివరించింది.

'అది నిజమే!' అబ్బాయి వదిన అంగీకరించింది.

'అబ్బాయేమైనా అడుగుతారేమో!' సూచనగా జానకిరామయ్య ప్రసాద్‌వైపు చూస్తూ అన్నాడు.

ప్రసాద్ మొహంలో ఆశ్చర్యం చూచాయగా అలముకుంది. ఇందాక తన తండ్రి 'పల్లెవాసన' అని అన్నమాట గుర్తుకొచ్చింది. పూర్తిగా పంజాబీడ్రస్సులో వున్న సుజాతలో అతనికి తెలుగు అమ్మాయి కనిపించడంలేదు.

సుజాత తల్లి ఉద్దేశంలో అమెరికా నుంచి వచ్చే అబ్బాయి ముందు పాత పద్ధతిలో చీర చుట్టబెట్టి అమ్మాయిని పెళ్ళి చూపుల్లో కూర్చోపెట్టడం సరైన పనికాదు. అందుకే పంజాబీ డ్రస్సు ప్రత్యేకంగా హైదరాబాదు నుంచి తెలిసినవాళ్ళతో తెప్పించింది.

అబ్బాయి మొహమాట పడుతున్నాడేమో ననుకుని 'అడుగు నాయనా.... అడుగు' అని సుజాత తల్లి ప్రోత్సహించింది.

అందరి కళ్ళూ ప్రసాద్ వైపు తిరిగాయి...

ప్రసాద్ ఏమీ మాట్లాడలేదు.

జానకిరామయ్యకి ఏమీ పాలుపోలేదు. ఒక ఆలోచన వచ్చింది.

'అబ్బాయి విడిగా అమ్మాయితో మాట్లాడాలనుకున్నారేమో!' సందేహం వెలిబుచ్చాడు.

'పోనీ, మనందరం పక్కగదిలోకి వెళ్దాం' అని జానకి రామయ్య ముందు దారితీశాడు.

సుజాతతప్ప తక్కినవాళ్ళు ఆయన వెనకాలే వెళ్ళారు.

కాస్సేపట్లో సుజాత బయటకు వచ్చి వేరే గదిలోకి వెళ్ళింది. ఆ గదిలోంచే 'అమ్మా! ఓసారి ఇలా రా!' అని పిలిచింది.

ఆ పిలుపు విని ఏమీ అర్థంకాక అంతా హాల్లోకి వచ్చారు. అక్కడ సుజాత లేదు. సుజాత తల్లి అటూ ఇటూ చూస్తోంది.

ప్రసాద్ చొరవ తీసుకుని 'ఆ గదిలోకి వెళ్ళండి' అని చెప్పాడు. తక్కినవాళ్ళు వచ్చి కుర్చీల్లో కూర్చున్నారు.

ఏం జరిగిందో... ఏం మాట్లాడుకున్నారో... అమ్మాయి గదిలోకి ఎందుకు వెళ్ళిపోయిందో... వాళ్ళ అమ్మని ఎందుకు పిలిచిందో అంతా అయోమయంగా తోచింది వారికి.

ప్రసాద్‌ని ఏమడగాలో పాలుపోలేదు.

'ఏరా అబ్బాయ్! అమ్మాయిని ఏమన్నా అడిగావా?' తండ్రి చొరవ తీసుకుని ప్రశ్నించాడు సందేహనివృత్తి- కోసం.

'అడిగా నాన్నా!' ఈ ముక్తసరి సమాధానం ఎవరికీ అర్థం కాలేదు.

ప్రసాద్ మొహం ప్రసన్నంగా వుండటంతో సంభాషణ బాగానే జరిగి వుంటుందనుకున్నారు.

'రెండు నిమిషాలు ఓపిక పట్టండి... మీకే తెలుస్తుంది' ప్రసాదే చెప్పాడు వాళ్ళ పరిస్థితి గమనించి.

అన్నప్రకారమే మరో రెండు నిమిషాల్లో గదిలోంచి సుజాతను తల్లి వెంట తీసుకొచ్చింది.

నెమలిపింఛం రంగు పట్టుచీర, కెంపు రంగు అంచుకు సరిపోయే జాకెట్టుతో సుజాత అందం పదింతలు పెరిగినట్టనిపించింది అందరికీ....

ప్రసాద్ ఆమె వంక మరింత పరీక్షగా చూశాడు. అతని మొహంలో ఆనందం పొంగులు వారింది. అది గమనించారు అంతా.

'అబ్బాయ్! నీకు అమ్మాయి నచ్చినట్లేనా?' తల్లి అడిగింది సంతోషం పట్టలేక.

'మీకు నచ్చిందా?' ఎదురుప్రశ్న వేశాడు.

'మాకు ఎప్పుడో నచ్చిందిరా!' తల్లి తబ్బిబ్బవుతూ అంది.

'నాకు ఇప్పుడే నచ్చింది' అన్నాడు, పట్టుచీరలో అప్సరసలా ఒదిగిన సుజాతను చూస్తూ ప్రసాద్.

సుజాత తల ఎత్తి అతని వైపు కృతజ్ఞతతో చూసింది.

నాలుగు కళ్ళూ ఊసులాడుతున్నాయి.

రాగలతలు పరవశించి పెనవేసుకున్నాయి.

(ఆదివారం 'ఆంధ్రభూమి' - 5 సెప్టెంబర్, 1999)